ప్రజల శ్రేయస్సు కోసం పనిచేస్తా

● ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బాలానగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తన గెలుపు కోసం కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలు, గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వినాయకనగర్‌లో ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తాను పదవుల కోసం పాకులాడలేదని, ప్రజల శ్రేయస్సు కోసం పనిచేస్తానన్నారు. కార్పొరేటర్, బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో సత్కరించారు.



కలెక్టర్ గౌతమ్‌కు వినతిపత్రం అందజేస్తున్న దళిత ఐక్యవేదిక సెంట్రల్ కమిటీ సభ్యులు

దళిత బంధు డబ్బులు బ్యాంక్‌లో జమచేయాలి

బాలానగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): దళిత బంధు లబ్ధిదారులకు డబ్బులను బ్యాంక్‌లో జమచేయాలని కూకట్‌పల్లి దళిత ఐక్యవేదిక సెంట్రల్ కమిటీ సభ్యులు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ పి. గౌతమ్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి 1100 మంది దరఖాస్తు చేసుకుని బ్యాంకు ఖాతాలు తెరిచారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు అర్హులైన దళితులకు దళిత బంధు మంజూరు చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. దళిత ఐక్యవేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల కవిత, జనరల్ సెక్రటరీ ఎడ్ల సత్యనాయణ, నాయకుడు నపారి చంద్రశేఖర్, బోడ నర్సింగ్‌రావు, కట్టానర్సింగ్‌రావు, బొట్టు విష్ణు, ఓల్డుబోయినపల్లి డివిజన్ ఎస్సీ విభాగం అధ్యక్షుడు బుర్రి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ కుటుంబాన్ని ఆదుకోవాలి

ఓల్డుబోయినపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): షిరోజ్‌గూడ అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తూ గుండెపోటుతో చనిపోయిన అంగన్‌వాడీ టీచర్ కాంతమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని సీఐటీయూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం ఉదయం కాంతమ్మ భర్తతో కలిసి కుత్బుల్లాపూర్ ప్రాజెక్ట్ ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు. రాజశేఖర్ మాట్లాడుతూ.. 36 సంవత్సరాలు అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేసిన కాంతమ్మ దహన సంస్కార ఖర్చులకు నయాపైసా ఇవ్వలేదని, మృతురాలి కుటుంబాన్ని సీడీపీవో, అధికారులు పరామర్శించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కాంతమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.



విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

లక్ష్యంతో చదివితే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చు

● ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యంతో చదువుకుంటే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. చింతల్‌లో పల్లవి స్కూల్ ద్వితీయ వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నాటకాలు ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు వివేకానంద్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్పొరేటర్ కేఎం. పారిజాత గౌరీష్, స్కూల్ చైర్మన్ కేఎం గౌరీష్, డైరెక్టర్లు విద్యాధర్, గిరిధర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నీలికుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

పేట్‌బషీరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర నీలికుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గురువారం తన నివాసంలో ఆవిష్కరించారు. నీలికుల సంఘం సభ్యులు సీహెచ్ వెంకటేష్, మాణిక్యం, ఎల్లప్ప, అంజయ్య, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి శేరిలింగంపల్లి సమస్యలు

మియాపూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సమస్యలు, అభివృద్ధిపై కాంగ్రెస్ ఇన్‌చార్జి వి. జగదీశ్వర్‌గౌడ్ రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబును సచివాలయంలో గురువారం కలిసి వివరించారు. మంత్రి సానుకూలంగా స్పందించారని, త్వరలో అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేస్తామని చెప్పారని జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు.



మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన జగదీశ్వర్‌గౌడ్

జడ్సీకి అంబేడ్కర్ చిత్రపటం

బాలానగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అభిలాష అభినవ్‌ను ఆలిండియా డిఫెన్స్ ఎంప్లాయీస్ ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఆమెకు పుష్పగుచ్ఛం, అంబేడ్కర్ చిత్రపటం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కర్కనాగరాజు, కార్యదర్శి కూతాడి కృష్ణ, హెచ్ఏఎల్ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు భాస్కర్, గ్రేటర్ ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం కార్యదర్శులు పరమేశ్, మనోహర్, జక్కుల అశోక్ జడ్సీని కలిసిన వారిలో ఉన్నారు.



జడ్సీకి అంబేడ్కర్ చిత్రపటం అందజేస్తున్న ఆలిండియా డిఫెన్స్ ఎంప్లాయీస్ ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ నాయకులు



సంస్కృతి పాఠశాలలో భోగిమంట

ఘనంగా సంక్రాంతి సంబరాలు

గచ్చిబౌలి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నల్లగండ్లలో గురు ద్రోణాచార్య పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ దుర్గగిరి సంక్రాంతి పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

● కొండాపూర్ సంస్కృతి పాఠశాలలో చిన్నారులకు భోగిపండ్లు పోశారు. విద్యార్థులు పతంగులు ఎగురవేసి ఉత్సాహంగా గడిపారు. ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మణ్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

రాయదుర్గం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ట్రైబల్ పెయింటింగ్, బ్లాక్ ప్రింటెడ్ సారీస్, గృహాలంకరణ వస్తువులు స్టాల్స్‌లో అందుబాటులో ఉంచారు. గురువారం సాయంత్రం నాట్యకల్ప కూచిపూడి డ్యాన్స్ అకాడమి లక్ష్మీప్రసూన శిష్యబృందం నిర్వహించిన కూచిపూడి ప్రదర్శన ఆకట్టుకుంది.



కళాకారుల నృత్యప్రదర్శన

పోరాట యోధుడు వడ్డె ఓబన్న

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఫతేనగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తెల్ల దొరల వెన్నులో వణుకు పుట్టించిన పోరాట యోధుడు వడ్డె ఓబన్న పోరాట పటిమను వడ్డెర కులస్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచించారు. ఫతేనగర్ వడ్డెర కులస్థులు ఏర్పాటు చేసిన వడ్డె ఓబన్న 215వ జయంతిలో ఆయన పాల్గొన్నారు. ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అనంతరం వడ్డెర కులస్థుల జెండా ఆవిష్కరించారు. కార్పొరేటర్ సతీష్‌గౌడ్, వడ్డెర సంఘం అధ్యక్షుడు సాగర కృష్ణ, బండారి శ్రీనివాస్‌రాజు. యు. రాజు, లక్ష్మణ్, గిరి తదితరులు పాల్గొన్నారు.

పేట్‌బషీరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కొంపల్లి మున్సిపాలిటీలో వడ్డెర సంఘం నిర్వహించిన వడ్డె ఓబన్న జయంతిలో కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు. ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు బి. ప్రశాంత్‌గౌడ్, వడ్డెర సంఘం నాయకులు బాలయ్య, తిరుపతి, వెంకటయ్య పాల్గొన్నారు.





వడ్డె ఓబన్నకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సతీష్‌గౌడ్, వడ్డెర సంఘం, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు

వివేకానందుడి బాటలో యువత నడవాలి

కార్పొరేటర్ మహేందర్

కూకట్‌పల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద చూపిన బాటలో యువత నడవాలని కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ అన్నారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా గురువారం మూసాపేట బబ్బుగూడ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు షూ, సాక్స్ పంపిణీ చేశారు. విద్యార్థులు చదువులో రాణించడంతోపాటు దేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేలా వ్యవహరించాలని కార్పొరేటర్ కోరారు. హెచ్ఎం దేవి, ఉపాధ్యాయులు శంకర్, లావణ్య, ఉమ, రేఖ, నాయకులు ఎర్రస్వామి, శ్రీనివాస్, శివరాజు, రమేష్‌నాయుడు, శ్రీధర్ పాల్గొన్నారు.



విద్యార్థినులకు షూ అందజేస్తున్న కార్పొరేటర్ మహేందర్

జిల్లా పరిషత్ పాఠశాలలో..

షాపూర్‌నగర్: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా సూరారం జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం యువజన దినోత్సవం నిర్వహించారు. విశ్రాంత ప్రిన్సిపాల్ విజయ్‌గోపాల్, సామాజిక కార్యకర్త రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. విద్యార్థులు పుస్తక పఠనం చేయాలని, మేధావులు, గురువుల సూచనలు పాటించాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పేవి శ్రద్ధగా వినాలన్నారు. ప్రైమరీ స్కూల్ హెచ్ఎం జావీద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫాతిమా షేక్ సేవలు చిరస్మరణీయం

బాలానగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సావిత్రిబాయి పూలే శిష్యురాలు ఫాతిమా షేక్ అభ్యుదయ భావాలను మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని తెలంగాణ బీసీ కులాల ఫెడరేషన్ సమితి మహిళా కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. గ్రేటర్ హైదరాబాద్ మహిళా కమిటీ అధ్యక్షురాలు బొగ్గు సునీత, వర్కింగ్ ప్రెసిడెంట్ అప్సర, ప్రధాన కార్యదర్శి వెన్ను అరుణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఫాతిమా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆమె సేవలను కొనియాడారు.

వారు మాట్లాడుతూ.. వచ్చే నెలలో సభ్యత నమోదు చేపట్టి, కొత్త కమిటీ సభ్యులతో ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తామని, మౌలిక సదుపాయాలు లేని పాఠశాలలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఉపాధ్యక్షురాలు సారారావు సుమిత్ర, దీప అనురాధ, భాస్కర్, అహ్మద్‌హుస్సేన్, నగేశ్‌సింగ్, సంగా వీరప్ప తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న బీసీ కులాల ఫెడరేషన్ సమితి నేతలు

సంక్రాంతి ముగ్గుల పోటీలు

గచ్చిబౌలి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నల్లగండ్ల గాంధీ ఎస్టేట్‌లో ఫ్రెండ్స్‌వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలకు గురువారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు కొమిరిశెట్టి ఫౌండేషన్ చైర్మన్ సాయిబాబా బహుమతులు అందజేశారు.

జగద్గిరిగుట్టలో..

జీడిమెట్ల: జగద్గిరిగుట్టలో సీపీఐ కార్యాలయం వద్ద గురువారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళా సమాఖ్య కార్యదర్శి హైమావతి, సీపీఐ రాష్ట్ర నాయకులు ఏసురత్నం, నియోజకవర్గం కార్యదర్శి ఉమామహేష్ పాల్గొన్నారు.



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

వీడియో కాల్ చేసి ప్రాధేయపడినా..

● ఇంటికి రాని భర్త.. భార్య ఆత్మహత్య

గాజులరామారం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులు తాళలేక ఓ గృహిణి ఆత్మహత్య చేసుకుంది. సూరారం సీఐ వెంకటేశ్వరావు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం ఆర్‌జీకే కాలనీలో ఎస్‌కే ఫర్హానా(35) భర్త ఎస్‌కే ఖదీర్‌అలీ, కుమార్తెతో కలిసి నివసిస్తున్నారు. వీరికి 2011లో వివాహమైంది. ఖదీర్ అలీ మద్యానికి బానిసై భార్యను కొంతకాలంగా వేధిస్తున్నాడు. తరచూ ఇద్దరి మధ్య గొడవ జరుగుతోంది. గురువారం ఉదయం కుమార్తె స్కూల్ ఫీజు విషయమై భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. కోపోద్రిక్తుడైన ఖదీర్‌అలీ బయటకు వెళ్లిపోయాడు. భార్య ఫర్హానా వీడియో కాల్ చేసి ఇంటికి రమ్మని ప్రాధేయపడినా అతడు వినలేదు. మా అమ్మకు సారి చెప్తేనే వస్తానన్నాడు. మనస్తాపం చెందిన ఫర్హానా ఇంట్లో ఉరేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. వీరికి గతంలో దుండిగల్ పోలీస్‌స్టేషన్‌లో పలుమార్లు కౌన్సెలింగ్ ఇచ్చారు.

మా ఫ్యామిలీ చెట్టుపై ఉంది..

● భారీ చెట్టెక్కి యువకుడి హల్‌చల్

బౌద్ధనగర్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): 'మా ఫ్యామిలీ చెట్టుపై ఉంది..' ఉంటూ ఓ యువకుడు భారీ చెట్టు ఎక్కి హల్‌చల్ చేశాడు. సుమారు రెండు గంటల పాటు పోలీసులను ముప్పతిప్పలు పెట్టాడు. డీఆర్ఎఫ్, ఫైర్ సిబ్బంది, పోలీసులు అందరూ కలిసి అతడిని అతికష్టం మీద కిందికి దించారు. అతడి మాటలను బట్టి మతిస్థిమితం లేనట్లుగా గుర్తించారు. ఈ సంఘటన గురువారం మధ్యాహ్నం చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ మట్టంరాజు, అడ్మిన్ ఎస్ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. అమర్‌టాకీస్ గల్లీ వద్ద ఓ యువకుడు పెద్ద చెట్టు ఎక్కి, ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు చిలకలగూడ పోలీసులకు సమాచారమందింది. ఇన్‌స్పెక్టర్ మట్టంరాజు, అడ్మిన్ ఎస్ఐ బాలరాజు సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. చెట్టు దిగమంటూ అతడిని కోరారు. చెట్టుపై ఉన్న యువకుడు ఏదేదో మాట్లాడుతున్నాడు. అతడిని మాటల్లో పెట్టి డీఆర్ఎఫ్, ఫైర్ సిబ్బంది క్రేన్ సహాయంతో కిందికి దించారు. వివరాలు అడిగితే తనపేరు రబీందర్, ఛత్తీస్‌గఢ్ అని చెప్పాడు. చెట్టు ఎందుకు ఎక్కావు అంటే తమ ఫ్యామిలీ చెట్టుపై ఉందంటూ ఇది నాగపూర్ కాదా.. అని పోలీసులను ప్రశ్నించాడు. పోలీసులు యువకుడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అతడిని చాకచక్యంగా కిందికి దించిన సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.



చెట్టుపై యువకుడు

'మియాపూర్‌లో సమస్యలు పరిష్కరించాలి'

మియాపూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ డివిజన్‌లో సమస్యలు పరిష్కరించాలని వాటర్‌వర్క్స్ డీజీఎం నాగప్రియకు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ గురువారం వినతిపత్ర అందజేశారు. డ్రైనేజీ, తాగునీటి పైపులైన్లు తదితర సమస్యలను డీజీఎంకు వివరించారు. పైపులైన్ల లీకేజీ వల్ల తాగునీరు వృథాగా రోడ్లపై పారుతోందన్నారు. కొత్త పైపులైన్ వేయాలని కోరారు.



కమాండెంట్‌తో సిబ్బంది

8వ బెటాలియన్‌లో ముగిసిన రిఫ్రెషర్ కోర్సు

గచ్చిబౌలి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ 8వ బెటాలియన్‌లో బి కంపెనీ వార్షిక రిఫ్రెషర్ కోర్సు గురువారం ముగిసింది. కార్యక్రమంలో భాగంగా బెటాలియన్‌లో స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. అదనపు కమాండెంట్ కె.సుబ్రహ్మణ్యం, సహాయక కమాండెంట్స్ దేవిదాస్ రాథోడ్, నరశివస్వామి తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ జోన్ డీసీపీగా నిఖితా పంత్



పేట్‌బషీరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జోన్ డీసీపీగా నిఖితా పంత్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆమె అంతకు ముందు హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ సైబరాబాద్ ఉమెన్స్ సేఫ్టీవింగ్‌లో పనిచేశారు.

'అన్నపూరణి చిత్రం నిలిపివేయాలి'

షాపూర్‌నగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మాన్ని పరిరక్షిస్తున్న బ్రాహ్మణులను కింపరిచేలా తీసిన అన్నపూరణి చిత్రాన్ని నిలిపివేయాలని గాయత్రి సేవా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. అన్నపూరణి చిత్రం, యూనిట్ సభ్యులపై సూరారం పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. పరశురామశర్మ, రాజేందర్ పిళ్లై, గడ్డం రాంబాబు, శంకర్‌శర్మ, శ్రీధరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారానికి యత్నించిన వాచ్‌మన్ అరెస్ట్

జీడిమెట్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి యత్నించిన వాచ్‌మన్‌ను జీడిమెట్ల పోలీసులు అరెస్ట్ చేశారు. ఈనెల 10వ తేదీన సైకిల్ తొక్కుకుంటున్న ఆరో తరగతి చదువుతున్న బాలికను వాచ్‌మన్ టెంట్‌హౌస్‌లోకి తీసుకెళ్లి అఘాయిత్యానికి యత్నించాడు. బాలిక కేకలు వేయడంతో పారిపోయాడు. నిందితుడు అమర్‌నాథ్‌ను గురువారం అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం స్వాధీనం

జీడిమెట్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): చెరువులో గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఉషాముళ్లపూడి ఆస్పత్రి సమీపంలో చెరువులో ఓ మహిళ మృతదేహం తేలియాడుతోంది. స్థానికుల గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని బయటకు తీసి గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి వయస్సు 35 సంవత్సరాలు ఉంటాయని, శరీరంపై పంజాబీడ్రెస్ ఉందని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి అదృశ్యం

బాలానగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు అదృశ్యమయ్యారు. రంగారెడ్డినగర్‌లో నివసిస్తున్న ఇసాక్ నవీన్ దీప్(38), సోదవరం కృపారాణి భార్యాభర్తలు. నవీన్‌దీప్ ప్రైవేట్ పరిశ్రమలో పనిచేసేవాడు. 2019లో కొవిడ్ బారిన పడడంతో ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటున్నాడు. గతనెల 22వ తేదీ రాత్రి ఆస్పత్రిలో ఉన్న స్నేహితుడి తండ్రిని కలిసి వస్తానని వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అతడి ఆచూకీ లభించకపోవడంతో భార్య కృపారాణి గురువారం బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఇసాక్ నవీన్ దీప్

మతిస్థిమితం లేని బాలుడు..

అల్లాపూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): అజీజ్‌నగర్‌కు చెందిన అస్రాబేగం, షేక్ ఇంతియాజ్ దంపతుల రెండో కుమారుడు షేక్ మహమ్మద్(12)కు మతిస్థిమితం లేదు. ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి ఆచూకీ లభించకపోవడంతో తల్లి అస్రాబేగం అల్లాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



షేక్ మహమ్మద్

ఈఎస్ఐ ఆస్పత్రికి వెళ్లిన వృద్ధురాలు..

జీడిమెట్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా, గజపతి మండలం, నీలాపురం గ్రామానికి చెందిన బొబ్బిలి సరోజిని(80) ఈనెల 10వ తేదీ ఉదయం షాపూర్‌నగర్ సంజయ్‌గాంధీ నగర్ నుంచి ఈఎస్ఐ ఆస్పత్రికి వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిత్తారమ్మ జాతరకు ఆహ్వానం



చిత్తారమ్మ జాతరకు రావాలని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు ఆహ్వాన పత్రం అందజేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్యగౌడ్, కమిటీ సభ్యులు

- షాపూర్‌నగర్, ఆంధ్రజ్యోతి

వాహనాలపై జోడో న్యాయ యాత్ర స్టికర్లు



ఈనెల 14 నుంచి రాహుల్‌గాంధీ చేపట్టనున్న జోడో న్యాయ యాత్రకు మద్దతు తెలుపుతూ పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి తమ వాహనాలపై గురువారం యాత్ర స్టికర్ అతికించారు. ఆయన అనుచరులు కూడా వాహనాలకు స్టికర్లు అతికించుకున్నారు.

- దుండిగల్ (ఆంధ్రజ్యోతి)

నిజాంపేట కార్పొరేషన్‌కు 'స్వచ్ఛ' అవార్డు



గృహ పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ కార్యదర్శి మనోజ్ జోషి చేతుల మీదుగా ఢిల్లీలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు అందుకుంటున్న నిజాంపేట మేయర్ కొలన్ నీలారెడ్డి

- నిజాంపేట (ఆంధ్రజ్యోతి)

ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడిగా వరుణ్‌చౌదరి



ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడిగా నియమితులైన వరుణ్‌చౌదరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గొల్ల జాన్

షాపూర్‌నగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడిగా నియమితులైన వరుణ్‌చౌదరిని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గొల్ల జాన్ గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.